క్లుప్తంగా

వేణుగోపాల స్వామి ఆలయంలో తెప్పోత్సవం



బయటకు తీసుకువస్తున్న పూజారులు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని వేణు గోపాలస్వామి ఆలయంలో చెరువు వద్ద స్వామివారికి తెప్పోత్సవం నిర్వహించారు. ఆదివారం పూలతో అలంకరించి స్వామివారికి పలు రకాల పూజలు పూజారి శ్రవణ్ కుమార్ నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పల్లా మురళీధర్, కమిటీ సభ్యులు సర్వేశ్, మల్లికార్జున్, గుజ్జలత, పలువురు మహిళలు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గానికి సన్మానం



పాలకవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

రామగిరి: కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ టౌన్ అధ్యక్షుడు భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులను ఏఎంసీ చైర్మన్ దాసరి రాజలింగు, వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, డైరెక్టర్లు సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మ్యాదర వేణి శారద, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ శ్రీదేవి, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు బూక్యా ఆశాకుమారి, సర్పంచ్‌లు పల్లె ప్రతిమ, అల్లం పద్మ, హరీష్, మైదం కుమార్, పాశం ఓదెలు, నాగరాజు, ఎంపీటీసీలు సంపత్, ఉమా, సుకన్య, కామ శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు



రామప్ప దేవాలయం వద్ద విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ విద్యార్థులు విజ్ఞాన యాత్రలో భాగంగా ఆదివారం చారిత్రక రామప్ప దేవాలయం, లక్నవరం లేక్‌ను సందర్శించారు. రామప్ప దేవాలయం చెక్కిన శిల్పుల శిల్ప కళా నైపుణ్యాన్ని, ఆలయ గోడలపై పలు రకాల చిత్రాల ఔచిత్యాన్ని, ప్రాశస్త్యాన్ని విద్యార్థులు తెలుసుకున్నారు. లక్నవరం చెరువులో పడవల్లో షికారు చేసి ప్రకృతి అందాన్ని ఆస్వాదించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సమ్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరులో పోచమ్మ బోనాలు



ధర్మారం: మండలంలోని కొత్తూరులో నిర్వహించే శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి జాతరను పురస్కరించుకుని ఆదివారం పోచమ్మ బోనంతో గ్రామస్తులు తరలివెళ్లారు. డప్పుచప్పుళ్లు, బోనాలతో ఊరేగింపుగా వెళ్లిన గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశం, ఉపసర్పంచ్ బానోతు రాజేశ్వరీ, ఏఎంసీ డైరెక్టర్ సాగల కోమురేశం, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి పోతనకాలనీ ప్రధాన చౌరస్తాలో ఆదివారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రంక్‌అండ్‌డ్రైవ్‌తోపాటు వాహనాలు తనిఖీ చేశారు. వాహనాదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. తనిఖీల్లో టూటౌన్ రెండో సీఐ అఫ్జలోద్దీన్, ఎస్సై కళాధర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెట్లు నరికివేత

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని నీరుకుల్ల రోడ్ విస్తరణ పనుల్లో భాగంగా చెట్లను నరికి వేస్తున్నారు. హరితహారంలో నాటిన మొక్కలు చెట్లుగా మారాయి. కాలుష్యం నివారణ, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు నాటిన మొక్కలు నరకడం పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆధ్యాత్మికం







ఘనంగా పోచమ్మ కొలుపు

కమాన్‌పూర్: మండలంలోని రొంపికుంటలో పోచమ్మ కొలుపు ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ వద్ద నెలకొల్పిన పోచమ్మ ఉత్సవ విగ్రహాల వద్ద శనివారం రాత్రి పంబాల పూజారులతో నుంచి కొలుపు ఉత్సవాలు ప్రారంభించారు. ఉత్సవాలను తిలకించడానికి గ్రామానికి చెందిన ప్రజలు, బంధువులు తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో సర్పంచ్ కట్కం రవీందర్, ఉప సర్పంచ్ గుమ్మడి సతీశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో యాగం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ 37వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ యాగశాలలో వేద పండితులు శ్రీమాన్ గోవర్ధనగిరి జగన్నాథచార్యులు, మధుసూదనాచార్యులు నారాసింహేష్టి యాగాన్ని శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ యాగంలో ఆర్జీ–2 జీఎం మనోహర్ దంపతులు, ఇతర సింగరేణి అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గోపు కొమురన్న జాతరలో భాగంగా తొలిరోజు ఆదివారం వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. శ్రీ మల్లికార్జునస్వామి కల్యాణంను వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా జంగమ పూజారులు పట్నం వేయగా యాదవులు భక్తి శ్రద్ధలను చాటుకున్నారు. అనంతరం జాతరకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. సోమవారం వేకువజామున అగ్నిగుండ ప్రవేశంతో జాతరకు ముగుస్తుంది. ఏర్పాట్లను జాతర కమిటీ చైర్మన్ గోపు అయిలయ్య యాదవ్ పర్యవేక్షిస్తున్నారు.

అలంకారప్రాయంగా దోబీ ఘాట్

- శిథిలావస్థకు చేరిన వైనం
- లక్షలాది రుపాయల ప్రజాధనం దుర్వినియోగం



నాగేపల్లిలో శిథిలావస్థకు చేరుకున్న దోబీఘాట్

రామగిరి: మండలంలోని నాగేపల్లిలో నిర్మించిన దోబీఘాట్ వినియోగించకపోవడంతో అలంకారప్రాయంగా మారి శిథిలావస్థకు చేరుకుంది. సింగరేణి సంస్థ ఆర్జీ– 3 పరిధి ఓసీపీ–2 నిర్వాసిత గ్రామం నాగేపల్లికి రత్నాపూర్ పంచాయతీ పరిధి మంథని, పెద్దపల్లి ప్రధాన రహదారిని ఆనుకుని బేగంపేట క్రాస్ రోడ్డు వద్ద పునరావసం కల్పించారు. అయితే గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా గ్రామ సమీపంలోని శ్మశానవాటిక వద్ద 2002లో సుమారు రూ.4 లక్షలతో దోబీఘాట్ నిర్మించారు. అయితే దాని నిర్మాణం పూర్తయినా వినియోగించకపోవడంతోపాటు సింగరేణి సంస్థ ఓసీపీ–2లో చేపట్టే భారీ బ్లాస్టింగ్‌లకు నిర్మించిన కొద్ది రోజులకే పగుళ్లు తేలి పాడైంది. దీంతో అధికారులు దానికి మరిన్ని నిధులు వెచ్చించి మరమ్మతులు చేయించారు. మరమ్మతులు చేయించిన తరువాత కొద్ది నెలల పాటు వినియోగంలోకి వచ్చిన దోబీఘాట్ ఆ తరువాత వినియోగించే వారు లేక అలంకారప్రాయంగా మారింది. లక్షలాది రుపాయలు వెచ్చించి నిర్మించిన దోబీఘాట్ నిరుపయోగంగా వదిలివేయడంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అలంకారప్రాయంగా మారిన దోబీ ఘాట్‌కు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామాల్లో వసతుల కల్పనకు పెద్దపీట

- ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కాల్వశ్రీరాంపూర్: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. మండలంలోని కూనారంలో రూ.27 లక్షల ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యం, సీసీరోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం, సాగునీరు వసతులు ఏర్పాటు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొట్టె సుజాత, వైస్ ఎంపీపీ శిరీష, పీఏసీఎస్ చైర్మన్లు రాంచంద్రా రెడ్డి, పురుషోత్తం, సర్పంచ్ విజయ, ఎంపీటీసీ రమాదేవి, నాయకులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు ప్రభుత్వ కానుక కల్యాణలక్ష్మి

పెద్దపల్లిరూరల్: పేదింటి ఆడబిడ్డల పెళ్లికి ప్రభుత్వం కానుకగా కల్యాణలక్ష్మి అందిస్తోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు.పట్టణంలోని అమర్ చంద్ కల్యాణ మండపంలో ఆదివారం 143 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బండారి స్రవంతి, జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి, వైస్ఎంపీపీ ముత్యాల రాజయ్య, కౌన్సిలర్లు చంద్రశేఖర్, భిక్షపతి, సర్పంచ్ కొమ్ము శ్రీనివాస్, తహసీల్దార్ వెంకటలక్ష్మి, డీటీ మల్లికార్జున్ నాయకులు పాల్గొన్నారు.

సైకిల్‌ర్యాలీ ప్రారంభించిన ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: ఆరోగ్యమహిళ..ఆరోగ్య భారత దేశం అనే నినాదంతో ప్రజల్లో అవగాహన పెంచేందుకు వైవైద్యారోగ్యశాఖ చేపట్టిన సైక్లోథాన్ (సైకిల్ ర్యాలీ)ని ఆదివారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వ కాలేజీ మైదానం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి రోజు కనీసం అరగంట సైకిల్ తొక్కుతూ వ్యాయామం చేయాలని ఎమ్మెల్యే అన్నారు. డయాబెటిస్, హైపర్‌టెన్షన్, మానసిక సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. నిత్యం వ్యాయామం చేయడం ఆరోగ్యానికి చాలా మంచిదన్నారు. మహిళలు ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా వైద్యశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్, రెడ్‌క్రాస్‌సొసైటీ కన్వీనర్ కావేటి రాజ్‌గోపాల్, వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

'ఖని'లో సినీనటుడు సోహైల్ సందడి



అభిమానులతో హీరో సోహైల్

గోదావరిఖనిటౌన్: సినీనటుడు సోహైల్ ఆదివారం గోదావరిఖని ఊర్వశీ థియేటర్‌లో తను హీరోగా నటించిన ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు సినిమాను అభిమానులతో కలిసి చూశారు. సోహైల్‌తో గోదావరిఖని ప్రాంత అభిమాన సంఘాల ఐక్య వేదిక జిల్లా చైర్మన్ గుండేటి రాజేశ్, అభిమానులు శామల శ్రీనివాస్, రాకేశ్, సాగర్, చంద్రశేఖర్, మిత్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు

ఓదెల: పరకాలలో జరిగిన ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ఓదెల హైస్కూల్ విద్యార్థులు పలు పతకాలు కైవసం చేసుకున్నారు. ఆదివారం జరిగిన కరాటే పోటీల్లో విద్యార్థులు నాలుగు బంగారు, మూడు వెండి పతకాల తోపాటు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. ఈసందర్భంఆ విద్యార్థులను పాఠశాల ఎస్ఎమ్మెస్ చైర్మన్ ఇప్పలపల్లి వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం బండ శోభారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

రథోత్సవానికి ఆహ్వానం

ధర్మారం: మండలంలోని దొంగతుర్తి శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 8న నిర్వహించే రథోత్సవానికి రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి ఎల్‌ఎం ట్రస్టు చైర్మన్ కొప్పుల స్నేహలతను గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ ముత్యాల చంద్రశేఖర్, ఎంపీటీసీ దాడి సదయ్య ఆదివారం ఆహ్వానించారు. కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో స్నేహలతను కలిసి రథోత్సవానికి రావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు బాలసాని లింగయ్య, నాయకులు బండి సురేష్, ముదాం శ్రావణ్‌కుమార్, సంకరి చిన్న ఓదేలు, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే చొరవతో చివరి భూములకు సాగునీరు



వాగును పరిశీలిస్తున్న జెడ్పీటీసీ తిరుపతి రెడ్డి

కాల్వశ్రీరాంపూర్: పెద్దపల్లి ఎమ్మెల్యే చొరవతోనే హుసేన్‌మియా వాగు, డీ–86, డీ–83 కాలువలు నీళ్లువచ్చాయని, చి'వరి'భూములకు నీరందుతుందని జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి అన్నారు. మండలంలోని గంగారం, రాతుపల్లి, పెగడపల్లి, మంగపేట, కూనారం గ్రామాల్లో ప్రవహిస్తున్న హుసేన్ మియా వాగును ఆదివారం పరిశీలించి మాట్లాడారు. కాలువ నీరు చేరి చెక్‌డ్యాంలు నిండి మత్తడి పడుతున్నాయని, కాలువ చివరి భూములకు నీటి తడి అందడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆయా కాలువల టేలాండ్ ప్రాంతాలైన కిష్టంపేట, తారుపల్లి, మొట్లపల్లి, మీర్జంపేట గ్రామాల రైతులకు కాలువ నీటి విడుదలతో పంటలు ఎండిపోకుండా కాపాడుకోగలుగుతున్నామని సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ జిన్న రాంచంద్రా రెడ్డి, నాయకులు జకంటి అనిల్, తూండ్ల రాజయ్య, రైతులు ఉన్నారు.

గ్రామ పంచాయతీల ఆదాయం పెంచాలి



జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జూలపల్లి: పన్నుల వసూలుతో గ్రామ పంచాయతీల ఆదాయం పెంచేందుకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి సూచించారు. ఆదివారం మండలంలోని కుమ్మరికుంటలో శిక్షణ ఐఏఎస్‌ల క్షేత్ర స్థాయి పరిశీలన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో శిక్షణ ఐఏఎస్‌లతో కలిసి పర్యటించారు. అనంతరం జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలించగా, పంచాయతీకి విద్యుత్ కేంద్రం నుంచి పన్నులు చెల్లించడం లేదన్న విషయాన్ని కార్యదర్శి అంజలీదర్ వివరించగా, డీపీవో చంద్రమౌళి కార్యదర్శులతో మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి పథంలో పయనించేందుకు నిధులు అవసరమని, దీనికి గ్రామ స్థాయిలో పన్నులు వసూలు చేసేందుకు కార్యదర్శులు కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట సర్పంచ్ సంతోశ్‌రావు, మండల పంచాయతీ అధికారి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు షురూ..



మల్లేపల్లి సమీపంలో రోడ్డు విస్తరణ పనులు

మంథని: మంథని–గోదావరిఖని రోడ్డులో మండలంలోని మల్లేపల్లి నుంచి మంథని శివారు వరకు అసంపూర్తిగా ఉన్న రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి.ఈ దారిలో ఐదు కిలో మీటర్ల రోడ్డు విస్తరణ, అభివృద్ధికి రూ. 5.2 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు ఇరువైపులా రోడ్డును తవ్వి విస్తరించి అభివృద్ధి చేస్తున్నారు. ఈ దారిలో అసంపూర్తి రోడ్డుతో వాహనదారులు పడుతున్న అవస్థలను ప్రస్తావిస్తూ సాక్షి గత నెల 20న కథనం ప్రచురించింది. ఈ మేరకు అసంపూర్తి రోడ్డు పనులను అధికారులు చేపట్టంతో వాహనదారుల కష్టాలు తీరనున్నాయి. పట్టణంలోని బొక్కలవాగు వంతెన నుంచి బస్సు డిపో వరకు పదిహేను రోజుల క్రితమే నూతనంగా బీటీ వేశారు. మిగిలిన రోడ్డును విస్తరించి అభివృద్ధి చేస్తున్నారు, దీంతో గోదావరిఖని– మంథని దారిలో వాహనదారులకు కష్టాలు తొలగిపోనున్నాయి.

గౌడ సొసైటీకి ఐదెకరాలు కేటాయించాలి



మాట్లాడుతున్న అంజయ్య గౌడ్

యైటింక్లయిన్‌కాలనీ: గౌడ సంఘం సొసైటీకి 560 జీవో ప్రకారం ప్రతి గ్రామంలో ఐదెకరాల భూమిని కేటాయించి, హైబ్రిడ్ రకం ఈత, తాటి చెట్లు అందించాలని సర్దార్ సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాగిరి అంజయ్య గౌడ్ అన్నారు. కల్లు గీత కార్మికుల ఆత్మ గౌరవ యాత్రలో భాగంగా ఆదివారం అల్లూరు ఎల్లమ్మ గుడి వద్ద మాట్లాడారు. కల్లు గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల మీద రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన సమస్యల పరిష్కారించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ గౌడ్, రాజయ్య, స్టాలిన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బాపు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం పాదయాత్రకు ఘన స్వాగతం

రామగిరి:మంథని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం నుంచి రాష్ట్ర అధ్యక్షుడు జాగీరు అంజిగౌడ్, జిల్లా నాయకుడు పల్లెర్ల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో సాగుతున్న మలి విడత కల్లు గీత కార్మికుల ఆత్మీయ గౌరవ పాదయాత్రకు శనివారం రాత్రి మండలంలోని రత్నాపూర్ వద్ద స్థానిక గౌడ సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాదయాత్ర చేస్తున్న నాయకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రత్నాపూర్ గౌడ సంఘం అధ్యక్షుడు ముక్కెర కృష్ణ స్వామి, సంఘం సభ్యులు ముక్కెర కుమార స్వామి, పబ్బ రాజమొగిలి, మొత్కూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వెలుగు శిబిరం ప్రారంభం

ఫెర్టిలైజర్‌సిటీ: కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లో లక్ష్మీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం కంటివెలుగు శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మెడికల్ ఆఫీసర్ తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని గౌతమినగర్ సొసైటీ అధ్యక్షుడు మాడుపతి గోపాలరావు తెలిపారు.

ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్



చాదర్ సమర్పిస్తున్న ఎమ్మెల్యే చందర్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ అల్లూరులోని దర్గాలో ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించి గంధం సమర్పించారు. కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు సయ్యద్ అఖీల్ బాబా, అహ్మద్ , నాయిమ్, మత పెద్దలు షకీల్ బాబా, హైమత్ బాబా, కార్పొరేటర్లు బాదె అంజలీ దేవి, సాగంటి శంకర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రి 20వ డివిజన్‌లోనే నిర్మించాలి

రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్‌లోనే ఈఎస్ఐ వంద పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు ఆదివారం క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్ కన్నూరి సతీశ్ కుమార్, బీఆర్ఎస్ నాయకుడు సలీంబేగ్ వినతిపత్రం అందజేశారు. స్థానిక డివిజన్‌లోని ప్రకృతివనం పక్కన ఉన్న ఆరు ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయిస్తూ కౌన్సిల్‌లో తీర్మానం చేసిన విషయాన్ని ఎమ్మెల్యేకు గుర్తు చేశారు. ఇటీవల ఇదే స్థలంలో ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలని మంత్రి మల్లారెడ్డిని కలిసినప్పటికీ కొంతమంది అధికారులను పక్కదారి పట్టిస్తున్నారని, దీంతో అయోమయం నెలకొందని పేర్కొన్నారు. దీనిపై ఎమ్మెల్యే చొరవ తీసుకొని ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి కార్యాచరణ ప్రారంభించాలని వినతిపత్రంలో కోరినట్లు కార్పొరేటర్ తెలిపారు.

అలరించిన సాంస్కృతికోత్సవాలు

గోదావరిఖని: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు పాల్గొని వివిధ ప్రదర్శనలిచ్చారు. ఇందులో విజేతలుగా నిలిచిన మహిళలకు ఈనెల 8న బహుమతులు అందజేయనున్నట్లు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు.

శ్రీఆదివరాహస్వామి ఆలయంలో సరస్వతీ యజ్ఞం



కమాన్‌పూర్: మండల కేంద్రంలోని శ్రీఆదివరాహస్వామి ఆలయంలో బ్రహ్మ శ్రీ అష్టకాల నరసింహరామశర్మ ఆధ్వర్యంలో ఆదివారం సరస్వతీ యజ్ఞం నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి యజ్ఞంలో పాల్గొనాలని కోరారు.

హిందూ సంఘటన్ కోసం పాటుపడదాం



సమావేశమైన హిందూవాహిని నాయకులు

పెద్దపల్లిరూరల్: హిందూ సంఘటన్ కోసం ప్రతి కార్యకర్త పాటుపడాలని హిందూవాహిని రాష్ట్ర సహ సంయోజక్ మల్లికార్జున్ కోరారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం జిల్లా కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కొందరు తమ ఉనికి చాటుకునేందుకు హిందూ దేవతలను కించపర్చే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని అలాంటి ద్రోహుల భరతం పడతామన్నారు. అనంతరం నూతన కమిటీని ఖరారు చేశారు.

పెద్దపల్లి సంయోజక్ గా శ్యాంసుందర్

పెద్దపల్లి పట్టణ సంయోజక్‌గా పూసాల శ్యాంసుందర్, పసిలేటి వెంకటసాయి, రామగిరి నరేశ్, సభ్యులుగా కీర్తి వెంకటేశ్, ఉప్పుల రిక్షిత్, అభిరాం, గౌతంసందీప్ ఎన్నికయ్యారు. సమావేశంలో నాయకులు రాజు, రాగం శ్రీధర్, సాయికుమార్ తదితరులున్నారు.